విద్యా విధానంలో విప్లవాత్మక మార్పులు

యలమంచిలి: ప్రభుత్వ విద్యా విధానంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చి, విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎంపీపీ రావూరి వెంకటరమణ అన్నారు. యలమంచిలిలోని పలు పాఠశాలల్లో బుధవారం ఆమె జగనన్న విద్యా కానుక కిట్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మన రాష్ట్రంలో పుట్టిన ప్రతి బిడ్డకు నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో మన జగనన్న పని చేస్తున్నట్లు ఆమె చెప్పారు. కనుకనే ఆయన ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన నాలుగేళ్లలో పేద విద్యార్థులకు సైతం ఆంగ్ల మాధ్యమంలో విద్యాబోధన ప్రవేశపెట్టారన్నారు. నాడు-నేడు పథకంలో పాఠశాల భవనాల రూపు రేఖలను సమూలంగా మార్చడమే కాకుండా మౌలిక వసతులను కార్పొరేట్ స్కూల్స్ స్థాయిలో కల్పించారన్నారు. జగనన్న గోరుముద్ద ద్వారా ప్రతి విద్యార్థి సమగ్ర ఎదుగుదలకు అవసరమైన ఆహారాన్ని అందిస్తున్నారన్నారు. ఇక ఈ ఏడాది పాఠశాల ప్రారంభం రోజునే జగనన్న విద్యా కానుక కిట్‌లు అందజేయడం విద్యార్థుల్లో నూతన ఉత్సాహాన్ని కలగజేస్తుందన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులంతా మంచిగా ఆలోచన చేసి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ చివటపు నాగేశ్వరరావు వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు మల్లుల బుజ్జి, వైఎస్సార్ సీపీ నాయకులు రావూరి వెంకట కోటి మురళీకృష్ణ, గుబ్బల శ్రీనివాస్, బొక్కా సురేష్, యలమంచిలి సత్యనారాయణమూర్తి, మేడిద ఆనందరావు హెచ్‌ఎం చింతా చిట్టిబాబు పాల్గొన్నారు.


యలమంచిలిలో విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ రావూరి వెంకటరమణ


దిగమర్రు జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు విద్యాకానుక కిట్లు అందజేస్తున్న సర్పంచ్ రాపాక నగేష్ కరుణాకర్

కాశీపట్నంలో..

మొగల్తూరు: జగనన్న విద్యా కానుక కిట్లను ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ కవురు సావిత్రి కోరారు. బుదవారం కాశీపట్నం పడమర గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలలో విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కవురు సీతా మహాలక్ష్మి, నాయకులు కవురు ఆదినారాయణ, సొసైటీ చైర్మన్ దొంగ నాగముని, కవురు సుబ్రమణ్యం, జక్కంశెట్టి ఏడుకొండలు పాల్గొన్నారు. పేరుపాలెం సౌత్ పంచాయతీలోని మేళంవారిమెరక ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కర్రి ఏసుబాబు, మేకం శ్రీనివాస్, పత్తి రాంబాబు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు మెరుగైన విద్య

పాలకొల్లు అర్బన్: పేద విద్యార్థులకు మెరుగైన విద్య అందించడం కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని సర్పంచ్ రాపాక నగేష్ కరుణాకర్ అన్నారు. మండలంలోని దిగమర్రు జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు విద్యాకానుక కిట్లు అందజేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న 200 మంది విద్యార్థులకు విద్యా కానుక కిట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కొండేటి మల్లికార్జునరావు, పాఠశాల హెచ్‌ఎం కె శ్రీనివాసరావు, పీఎంసీ చైర్మన్ పాలపర్తి చంద్రశేఖర్, వైస్‌చైర్మన్ పరిమి ప్రసన్న, వైసీపీ నాయకుడు పాలపర్తి కుమారరత్నం, ఆరేపల్లి రాఘవులు, కారెంకి ఇందిర, నిల్లా గంగాభవాని, సహోపాధ్యాయులు షేక్ పీర్ సాహెబ్, కేవీ పద్మావతి పాల్గొన్నారు.

గోశాలకు పశువుల తరలింపు


రోడ్లపై తిరుగుతున్న పశువులను గోశాలకు తరలిస్తున్న మున్సిపల్ సిబ్బంది

నరసాపురం: రోడ్లపై విచ్చల విడిగా తిరుగుతున్న పశువులను యజమానులు తమ అధీనంలో పెట్టుకోవాలని మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు సూచించారు. బుధవారం కమిషనర్ రోడ్లపై తిరుగుతున్న పశులను పరిశీలించారు. మున్సిపల్ సిబ్బందితో వాటిని గోశాలకు తరలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పశువుల యజమానులకు నోటీసులు ఇచ్చినా స్పందించడం లేదన్నారు. రోడ్లపై తిరుగుతున్న పశువుల కారణంగా ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, పారిశుధ్య ఇబ్బందులు తలెత్తుతున్నాయని చెప్పారు. ఇకపై రోడ్లపై తిరుగుతున్న పశులను తమ అధీనంలో తీసుకుని వాటి యజమానులకు రోజుకు రూ.1000 ఫైన్ వేస్తామన్నారు. యజమానులు 3 రోజుల్లో వచ్చి ఫైన్ చెల్లించాలని లేకుంటే పశువులను గోశాలకు తరలిస్తామని హెచ్చరించారు.

క్లుప్తంగా

చురుగ్గా పంట బోదె తవ్వకం పనులు


పాతపాడులో పంట బోదె తవ్వుతున్న ఉపాధి కూలీలు

మొగల్తూరు: ప్రధాన కాలువలు వదిలినా ప్రతీ శివారు ప్రాంతాలకు పూర్తిస్థాయిలో నీరందెలా పంటబోదె తవ్వకం పనులు చురుగ్గా సాగుతున్నాయి. బుధవారం మొగల్తూరు, పాతపాడు, కోమటితిప్పలో పంట బోదెల్లో మట్టి మేటలు వేయడంతో తవ్వకం పనులు చేపట్టారు. వ్యవసాయపనులు ప్రారంభించేలోపుగా ప్రతి ఎకరాకు నీరందేలా పంట బోదె తవ్వకం పనులు చేపట్టామని ఏపీవో వై శ్రీనివాస్ తెలిపారు.

గ్రామ కార్యదర్శులతో డీపీఓ సమావేశం

యలమంచిలి: యలమంచిలి మండలంలో గోదావరి పరివాహక లంక గ్రామాల్లో వరదల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను జిల్లా పంచాయతీ అధికారి మల్లికార్జున బుధవారం సమీక్ష చేశారు. స్థానిక మండ పరిషత్ కార్యాలయంలో గ్రామ కార్యదర్శులకు వరదల సమయంలో తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలనూ చర్చించారు. అనంతరం మిగిలిన గ్రామాల్లో తాగునీరు, వీధి దీపాలు, పారిశుధ్యం, రోడ్లు తదితర పనుల నిర్వహణను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌పీఓ బలరామ్, ఎంపీడీఓ చివటం త్రిశూలపాణి, ఈఓపీఆర్డీ కాటూరి మాణిక్య వైభావతి ఉన్నారు.

నారినమెరక సర్పంచ్ భర్త మృతి

యలమంచిలి: నారినమెరక సర్పంచ్ వలవల లక్ష్మి భర్త సత్యనారాయణ బుధవారం ఉదయం మరణించారు. ఆయన కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆయన మరణ వార్త తెలిసిన వెంటనే ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి కవురు శ్రీనివాస్ నారినమెరక వెళ్లి సత్యనారాయణ మృతదేహంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు వల్లభు సాయి వెంకట నరసింహారావు, కాజ తూర్పు సర్పంచ్ పాలంకి శ్రీనివాసరావు, స్థానిక ఎంపీటీసీ ఇసుకపల్లి శ్రీధర్‌వర్మ, మేడపాడు సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ గుర్రాల వెంకట్రావు వైఎస్సార్ సీపీ నాయకులు వీరా ఉమాశంకర్, కల్యాణం గంగాధరరావు, వలవల సత్య ధర్మారావు తదితరులు సత్యనారాయణ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

ఎలక్ట్రికల్ సబ్‌స్టేషన్ ముట్టడి

పాలకొల్లు అర్బన్: ఎలక్ట్రికల్ ఏఈ తీరుని నిరసిస్తూ పూలపల్లి సబ్ స్టేషన్ వద్ద చింతపర్రు గ్రామ ప్రజలు ఆందోళన చేపట్టారు. మూడు నెలలుగా గ్రామంలోని బాడవ వద్ద గల 63 కేవీ ఎలక్ట్రికల్ ట్రాన్స్‌ఫార్మర్ మార్చాలని కోరుతున్నా పట్టించుకోవడం లేదని గ్రామ సర్పంచ్ గుమ్మాపు పెద్దిరాజు, 11,12 వార్డు సభ్యులు మైలా మరియమ్మ, వీరమల్లు సత్తిబాబు ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల గ్రామంలోని పలు వార్డుల ప్రజలు లోవోల్టేజీ సమస్యలతో సతమతమవుతున్నామన్నారు. 63 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని కోరుతున్నా ఏఈ స్పందన కరువయ్యిందన్నారు. వినియోగదారులకు సమాధానం చెప్పడం లేదని వారన్నారు. ఎలక్ట్రికల్ ఉన్నతాధికారులు స్పందించి తక్షణం సమస్యను పరిష్కరించాలని వారు కోరారు.

నేడు విద్యార్థులకు సత్కారం

ఉండి, ఆకివీడు : ఉండి జెడ్పీ హైస్కూల్‌లో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమాన్ని నియోజకవర్గస్థాయిలో గురువారం ఉదయం 10.30 గంటలకు నిర్వహిస్తున్నట్లు మండల విద్యాశాఖాధికారి ఏ రవీంద్ర తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో నియోజకవర్గ స్థాయిలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులను సత్కరించి ప్రథమ స్థానానికి రూ.15 వేలు, ద్వితీయ స్థానానికి రూ.10 వేలు, తృతీయ స్థానానికి రూ.5 వేలు చొప్పున నగదు బహుమతి, మెడల్, సర్టిఫికెట్ ఇవ్వడం జరుగుతుందన్నారు.10వ తరగతిలో అల్లు ఓం సాయిశ్రీనివాస్ (579), గూడవల్లి దుర్గాదేవీప్రసన్న (573), ఆకుల శ్రావణి (572), ముత్యం సౌజన్య మనోహరీ (572) మొదటి మూడుస్థానాల్లో నిలిచారన్నారు. జూనియర్ కళాశాలల్లో వివిధ గ్రూపుల్లో ప్రథమస్థానంలో నిలిచిన డీవీ లక్ష్మీ (899), జి.సంధ్యారాణి (911) పి.మౌనిక (958) ఒక్కొక్కరికీ రూ.15 వేలు చొప్పున నగదు బహుమతి ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు, ఇతర ప్రజాప్రతినిధులు హాజవుతున్నట్లు ఎంఈవో తెలిపారు.

ముగిసిన స్కేటింగ్ శిక్షణ

సాక్షి, భీమవరం : పట్టణంలోని ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో రోలర్ స్కేటింగ్‌పై నెల రోజులు పాటు నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం ముగిసింది. ఈ సందర్భంగా శిక్షణ పొందిన క్రీడాకారులకు పోటీలు నిర్వహించి ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ కేవీ మురళీకృష్ణంరాజు చేతులమీదుగా విజేతలకు బహుమతులు అందజేశారు. ఫిజికల్ డైరెక్టర్ పి సత్యనారాయణరాజు మాట్లాడుతూ ఎటువంటి రుసుము లేకుండా కళాశాల సహకారంతో శిక్షణ అందించమన్నారు. అసిస్టెంట్ ఫిజికల్ డైరెక్టర్స్ సీహెచ్ హరిమోహన్ పాల్గొన్నారు.

అధికారుల గైర్హాజరుపై కలెక్టర్‌కి ఫిర్యాదు చేస్తాం

- ఎలక్ట్రికల్ ఏఈ తీరుపై మండిపడ్డ ఎంపీపీ, ఎంపీటీసీ సభ్యులు
- పాలకొల్లులో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం


పాలకొల్లు మండల పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ చిట్టూరి కనకలక్ష్మి


పాలకొల్లు అర్బన్: మండల పరిషత్ సర్వ సభ్య సమావేశానికి హాజరుకాని అధికారులపై కలెక్టర్‌కి ఫిర్యాదు చేస్తానని ఎంపీపీ చిట్టూరి కనకలక్ష్మి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలపై స్పందించని అధికారులపైనా, సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు గౌరవం ఇవ్వని అధికారులపై చర్యలు తప్పవని ఎంపీపీ కనకలక్ష్మి హెచ్చరించారు. పాలకొల్లు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జీఎంసీ బాలయోగి సమావేశ మందిరంలో బుధవారం ఎంపీపీ చిట్టూరి కనకలక్ష్మి అధ్యక్షతన జరిగింది. ప్రతిపక్షనేత శాగా సత్యనారాయణ మాట్లాడుతూ గ్రామాల్లో విద్యుత్ కోతలు తీవ్రంగా ఉంటున్నాయని ఎలక్ట్రికల్ ఏఈ సమావేశానికి ఎందుకు హాజరుకాలేదని ప్రశ్నించారు. ఆ అధికారి సమావేశానికి వచ్చి సమాధానం చెప్పేవరకు సమావేశం ముగించడానికి వీలులేదని పట్టుబట్టారు. దిగమర్రు సర్పంచ్ రాపాక నగేష్ కరుణాకర్ మాట్లాడుతూ దిగమర్రు ఛానెల్‌లోకి మునిసిపాలీలోని వెలమగూడెం ప్రజల వాడకం, మరుగుదొడ్లలో వాడకం నీరు పైపులైన్‌లు పెట్టడంతో పంటకాలువలా కాకుండా మురుగు డ్రెయిన్‌లో మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మునిసిపల్ కమిషనర్‌కి నోటీసు ఇవ్వాలని సమావేశంలో సూచించారు. వెలివెల సర్పంచ్ కెల్లా సింహాచలం ఇదే సమస్యపై మాట్లాడుతూ భగ్గేశ్వరం పంట కాలువ నుంచి తమ గ్రామంలోని పంచాయతీ చెరువుకి మంచినీరు పెట్టాలని, అయితే ప్రస్తుతం మురుగు డ్రెయిన్‌లా మారిందని సమావేశంలో సభ్యులు దృష్టికి తీసుకువచ్చారు. మండల కోఆప్షన్ సభ్యులు తండా ఇస్సాక్‌రాజు, వైఎస్ ఎంపీపీ పడవల సునీల్‌బాబు రాపాక ఛానెల్, భగ్గేశ్వరం డ్రెయిన్ల మరమ్మతులు చేయాలని కోరారు. అనంతరం పలు శాఖల పనితీరుపై సమీక్షించారు. సమావేశంలో వైస్‌ఎంపీపీ యన్నాబత్తుల నాగేశ్వరరావు, ఎంపీడీవో సంగాని వెంకటేశ్వరరావు, తహసీల్దార్ సీహెచ్ పెద్దిరాజు, ఈవోపీఆర్డీ షేక్ అమర్ షరీఫ్, ఎంపీటీసీలు పెదపాటి వెంకటరత్నం, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో గ్రామాలు


కొత్తపేటలో సీసీ రహదారుల నిర్మాణం పనులు ప్రారంభించిన సర్పంచ్ సోనియారమేష్

పోడూరు: సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టాక గ్రామాలు అభివృద్ధి పథంలో నడుస్తున్నాయని గుమ్మలూరు సర్పంచ్ గొట్టుముక్కల సోనియా రమేష్ అన్నారు. గుమ్మలూరు శివారు కొత్తపేట, రావిగొప్పు, పెదపేట ప్రాంతాల్లో గడపగడపకు మన ప్రభుత్వం నిధులు రూ.40 లక్షల వ్యయంతో సీసీ రహదారుల నిర్మాణ పనులను బుధవారం ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజుకు గ్రామస్తులు రోడ్ల సమస్యలు విన్నవించారన్నారు. వారి విజ్ఞప్తిమేరకు ఎమ్మెల్యే వెంటనే స్పందించి కొత్తపేటలో రూ.10 లక్షలు, రావిగొప్పులో రూ.10 లక్షలు, పెదపేటలో రూ.20 లక్షలు నిధులతో సీసీ రహదారుల నిర్మాణానికి చర్యలు తీసుకున్నారన్నారు. గ్రామంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక ఎమ్మెల్యే శ్రీరంగనాథరాజు రూ.కోట్ల నిధులతో గ్రామంలో అభివృద్ధి పనులను పూర్తి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ పిల్లి నాగన్న, జేసీఎస్ కన్వీనర్ పైడి ఏసుబాబు, ఎంపీటీసీ అంబటి సుధాకర్, కుక్కల నాగేశ్వరరావు, కొండేటి వెంకటేశ్వరరావు, పైడి నాగమణి, గొట్టుముక్కల సురేష్, పైడి ఈశ్వరరావు, పైడి పండు, ఏలూరి ఆశీర్వాదం, పొలమూరి భూషణం, గొట్టుముక్కల సామ్యేలు పాల్గొన్నారు.

రక్తదానం చేసిన విద్యార్థులు


రక్తదానం చేస్తున్న ఛాంబర్స్ కళాశాల విద్యార్థులు, కళాశాల కమిటీ సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: అన్ని దానాల కన్నా రక్తదానం ఎంతో గొప్పదని ఛాంబర్స్ కళాశాల చైర్మన్ కారుమూరి నరసింహారావు తెలిపారు. బుధవారం ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా స్థానిక బీఆర్ఆర్ అండ్ జీకేఆర్ ఛాంబర్స్ డిగ్రీ అండ్ పీజీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్స్, బ్లడ్ డోనర్స్ క్లబ్, ఆపద్బంధు వలంటీర్ బ్లడ్ సెంటర్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 45 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ డి వెంకటేశ్వరరావు, అకాడమిక్ అడ్వైజర్ ఎ.బి.ఎస్ మూర్తి, నందుల సీతారామారావు, వినుకొండ రంగారావు, దేవరపు లక్ష్మీనారాయణ, ఎస్ కామేశ్వరరావు, జయప్రకాష్, ఆపద్బంధు వలంటీర్ బ్లడ్ బ్యాంకు నిర్వాహకులు పాల్గొన్నారు. ఆదిత్య కళాశాలలో ఏర్పాటు చేసిన శిబిరంలో 50 మంది కళాశాల విద్యార్థులు రక్తదానం చేశారు. ప్రిన్సిపాల్ కె. గంగాదర్, వైస్ ప్రిన్సిపాల్ జి లక్ష్మీనారాయణ, ఎం సురేష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఐ రవికిరణ్, కె. వినయ్, ఎస్ పురుషోత్తమరావు పాల్గొన్నారు.

ప్రీస్కూలు విద్య చిన్నారుల భవితకు పునాది


జిన్నూరులో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది, చిన్నారులు

పోడూరు: ప్రీస్కూలు స్థాయి నుంచే తగిన విద్యాబోధన అందించడం ద్వారా అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల భవిష్యత్తుకు పునాది వేస్తున్నట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జి.హేమతులసి అన్నారు. ఐసీడీఎస్ సీడీపీఓ సీహెచ్ ఇందిర ఆదేశాల మేరకు బుధవారం జిన్నూరు మెయిన్ విలేజ్, నర్సరాజు నగర్ అంగన్‌వాడీ కేంద్రాల్లో జన్‌భగీదారి కార్యక్రమం నిర్వహించారు. అవగాహన సదస్సు, అంగన్‌వాడీ సెంటర్ల పరిధిలో ర్యాలీ నిర్వహించారు. సూపర్‌వైజర్ హేమతులసి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించే కార్యక్రమాలు ప్రీస్కూల్ విద్యార్థులకు ఏ విధంగా ఉపయోగపడతాయో తల్లిదండ్రులకు వివరించారు. సర్పంచ్ జమ్ము బేబీ మహాలక్ష్మి, ఏఎంసీ డైరెక్టర్ జమ్ము బుజ్జి, ఎంపీటీసీ బీహెచ్. సత్యవతి, అంగన్‌వాడీ టీచర్లు ఎ.సునీత, ఎస్.విజయపద్మ, యు.లక్ష్మీరమణ, సీఆర్‌పీ కాటం భారతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైభవంగా వేణుగోపాలుడి కల్యాణం

ఆకివీడు : స్థానిక రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి కల్యాణోత్సవం బుధవారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. భాజా భజంత్రీలు, మేళ తాళాలతో, వేద మంత్రాల నడుమ కల్యాణం నిర్వహించారు. ఈ కల్యాణంలో పలువురు దంపతులు పాల్గొని పూజలు చేశారు. స్థానిక రాజ రాజేశ్వరి సహిత మార్కండేయేశ్వర స్వామి ఆలయంలో బుధవారం నవగ్రహ విగ్రహాల పునఃప్రతిష్ఠ నిర్వహించారు. అనంతరం విగ్రహాలను ప్రతిష్ఠ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గొంట్లా గణపతి, కార్యదర్శి కాకర్ల రాజరాజేశ్వరి, కాకర్ల ఫణి స్థానికులు పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శం


వడ్లవానిపాలెంలో రూ.20 లక్షలతో నిర్మించనున్న పంచాయతీ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్

పాలకొల్లు అర్బన్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వలంటీర్, సచివాలయ వ్యవస్థలు దేశానికే ఆదర్శమని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ అన్నారు. పాలకొల్లు మండలం వడ్లవానిపాలెంలో జిల్లా పరిషత్ నిధులు రూ.20లక్షలతో గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులకు బుధవారం ఎమ్మెల్సీ శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు. ప్రజలకు నేరుగా సంక్షేమ ఫలాలను వలంటీర్ల ద్వారా అవినీతికి అవకాశం లేకుండా అమలు చేస్తున్నారన్నారు. లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా సొమ్ములు జమ చేయడం గొప్ప పరిణామమన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో సంక్షేమ ఫలాలన్నీ జన్మభూమి కమిటీల ద్వారా డబ్బులు చెల్లించినవారికే సంక్షేమ ఫలాలు అందించేవని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పెన్మెత్స పద్మ, వైసీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పెన్మెత్స ఏసురాజు, పార్టీ మండల కన్వీనర్ ఎం మైఖేల్‌రాజు, మండల పరిషత్ మాజీ ప్రతిపక్షనేత చిట్టూరి ఏడుకొండలు, మాజీ సర్పంచ్‌లు పెన్మెత్స ఏసురాజు, మాంద్రు షాలిని, వేల్పూరి అప్పారావు, గ్రామ పార్టీ నాయకులు అల్లం బుజ్జి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి డీటీడీసీ బాబు పాల్గొన్నారు.

మేడపాడు జగనన్న కాలనీ పరిశీలన

పట్టణంలో విలీనమైన కొంతేరు శివారు మేడపాడు జగనన్న కాలనీని ఎమ్మెల్సీ శ్రీనివాస్ సందర్శించారు. కాలనీలో మౌలిక వసతులు కల్పించడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. రోడ్లు, డ్రెయిన్లు, విద్యుత్, మంచినీరు తదితర పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఆయన వెంట డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ, పట్టణ పార్టీ అధ్యక్షుడు చందక సత్తిబాబు, పార్టీ నాయకులు ఖండవల్లి వాసు, మోర్త గిరీష్, బండి రమేష్, తలుపుల భుజంగరావు తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థుల చదువుపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ


మంత్రి బొత్స సత్యనారాయణను కలిసిన వేణుమాధవరెడ్డి

పెనుమంట్ర: రాష్ట్రంలో పేద విద్యార్థుల చదువుపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్య, మౌలిక వసతుల అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ కొవ్వూరి వేణుమాధవరెడ్డి అన్నారు. బుధవారం డైరెక్టర్‌గా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం స్వగ్రామంలో ఆయన మాట్లాడుతూ విద్యావిధానాలలో నూతన ఒరవడి తీసుకువచ్చి విద్యార్థులకు మెరుగైన విద్యను అందిస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. పేద విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించేందుకు ఆర్థిక సాయం చేస్తూ జగనన్న ప్రభుత్వం పేద విద్యార్థులకు అండగా నిలుస్తోందన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయిలో డైరెక్టర్ పదవి ద్వారా బాధ్యతలు అప్పగించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాబోవు ఎన్నికలలో వైఎస్సార్ సీపీ అభ్యర్థుల గెలుపుకోసం పార్టీ ప్రతిష్ఠత కోసం తన శక్తివంచన లేకుండా కృషిచేస్తానని ఆయన అన్నారు.

19 నుంచి ఏఎస్ఎన్ఎం డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం


సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ టి రాజరాజేశ్వరి, అధ్యాపకులు

పాలకొల్లు సెంట్రల్: ప్రభుత్వ కళాశాలల్లో అతి తక్కువ ఫీజులతో మెరుగైన విద్య అందుతుందని ప్రిన్సిపాల్ డాక్టర్ టి రాజరాజేశ్వరి తెలిపారు. బుధవారం స్థానిక అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నూతన అడ్మిషన్లపై సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రాజరాజేశ్వరి మాట్లాడుతూ ఈ నెల 19 నుంచి 24వ తేదీ వరకూ కళాశాలలో దరఖాస్తు ప్రక్రియ కొనసాగుతుందన్నారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ కోసం కళాశాలలో ఉచిత సౌకర్యం ఏర్పాటు చేశామన్నారు. ఈ నెల 26 నుంచి 30వ తేదీ వరకూ వెబ్ ఆప్షన్స్ కళాశాలలో ఉచితంగా నమోదు చేసుకోవచ్చన్నారు. జులై 3న సీట్ల కేటాయింపు జులై 4వ తేదీ నుంచి తరగతులు ప్రారంభిస్తామన్నారు. వివరాలకు అడ్మిషన్స్ కన్వీనర్ సెల్ 9143839999, 9121702721, 8074878227, 9963180348 నంబర్లలో సంప్రదించాలన్నారు. అధ్యాపకులు ఏ వంశీ, కృష్ణ, బి సుబ్బలక్ష్మి, దినకరన్, సూపరింటెండెంట్ పతంజలి పాల్గొన్నారు.

కనకదుర్గమ్మ ఆలయం వద్ద షెడ్డు ప్రారంభం

కాళ్ల : కాళ్లకూరు వెంకటాపురం గ్రామంలో కనకదుర్గ అమ్మవారి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన షెడ్డును బుధవారం ప్రారంభోత్సవం చేశారు. అమ్మవారి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించుకునేందుకు, అలాగే ఏటా ఉత్సవాలలో పాల్గొనే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా దాతలు కోవాగాని నరసింహనాయుడు గౌరీ జ్ఞాపకార్థం వారి కుమారుడు నారాయణ స్వామి సహకారంతో ఈ షెడ్ ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథులుగా విచ్చేసిన సర్పంచ్, ఉప సర్పంచ్‌లు సాధు శ్రీదేవి, నడింపల్లి ప్రదీప్ ఈ షెడ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా దాతలను అభినందించారు. కార్యక్రమంలో దండు వెంకట కృష్ణంరాజు, తోటకూర రవి, సాధు శ్రీను, గ్రామ పెద్దలు, ఆలయ నిర్వాహకులు హాజరయ్యారు.

దాడి ఘటనపై కేసు నమోదు

భీమవరం అర్బన్ : తనపై అన్యాయంగా దాడిచేసి కొట్టి గాయపరిచారని ఓ వ్యక్తి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం నరసింహపురం గ్రామానికి చెందిన ములపర్తి శ్రీనుని అదేగ్రామానికి చెందిన ములపర్తి యేసేబు, నార్కిమెల్లి జాన్ ప్రకాష్, నార్కిమెల్లి లూథియా, ములపర్తి సుధీర్ అన్యాయంగా కొట్టి గాయపరిచారని బాధితుడు శ్రీను ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ పి.మహేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాగి తీగ చోరీ

ఆకివీడు : గుమ్ములూరు గ్రామంలో జియో సెల్ టవర్‌లో సుమారు 200 మీటర్ల రాగితీగ దొంగతనంపై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై కె.రాజారెడ్డి చెప్పారు. అదే కంపెనీలో పనిచేస్తున్న విశాఖపట్నం జిల్లా యలమంచిలికి చెందిన జంగం నాగేశ్వరరావు, పీనుపోలు మణికంఠ దొంగిలించినట్లు టవర్ ఎంప్లాయ్ జి.రామచంద్ర ఫిర్యాదు చేసినట్లు ఎస్సై తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

నారా వారి ప్రయోజనం కోసమే వారాహి యాత్ర

పాలకొల్లు అర్బన్: జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ అన్నవరం నుంచి కేవలం నారా చంద్రబాబునాయుడు ప్రయోజనం కోసం వారాహి యాత్ర ప్రారంభించినట్టు వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కుంచిలపల్లి వినిస్టన్‌బాబు బుధవారం విమర్శించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం పాటుపడుతుంటే దత్త పుత్రుడు పవన్‌కల్యాణ్ చంద్రబాబునాయుడు ప్రయోజనం కోసం పనిచేస్తున్నారని దుయ్యబట్టారు. పాలకొల్లు నియోజకవర్గంలో ఎమ్మెల్యే రామానాయుడు దళితుల పేరుతో చేస్తున్న పోరాటం బూటకమన్నారు. వైఎస్సార్ సీపీకి దళితులు అండగా ఉన్నారని స్పష్టం చేశారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే నిమ్మలకు డిపాజిట్లు కూడా దక్కవన్నారు.